క్లుప్తంగా

ప్రైవేటు డయాగ్నోస్టిక్ సెంటర్లపై చర్యకు డిమాండ్

కడప సెవెన్‌రోడ్స్: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేటు డయాగ్నోస్టిక్ సెంటర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చిన్ని, శివకుమార్ డిమాండ్ చేశారు. సోమవారం డీఆర్వో గంగాధర్‌గౌడ్‌కు వినతిపత్రమిచ్చారు. డయాగ్నోస్టిక్ సెంటర్లు అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని తెలిపారు. ఎక్కడా ధరల పట్టిక లేదన్నారు. కొన్ని సెంటర్లలో డబ్బులు తీసుకున్నా రశీదులు కూడా ఇవ్వడం లేదని ఆరోపించారు. డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి డీఎం ఓబులేశు, ఉపాధ్యక్షులు నరసింహులు పాల్గొన్నారు.

నేడు సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం

కడప వైఎస్ఆర్ సర్కిల్: నేడు నగరంలో నిర్వహించనున్న సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. 53 ఏళ్లుగా కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటాలను నిర్వహిస్తోందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తూ ప్రభుత్వం రంగ సంస్థలైన బీఎస్ఎన్ఎల్, రైల్వే, ఎల్ఐసీ విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేట్ పరం చేసేందుకు కుట్ర పన్నుతోందని ధ్వజమెత్తారు. నేడు జిల్లా వ్యాప్తంగా సీఐటీయూ జెండాలను ఎగుర వేసి ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదాలను నివారించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : నగరంలోని రిమ్స్ రహదారిలో రోడ్డు ప్రమాదాలను నివారించాలని ఆర్‌సీపీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని కలెక్టరేట్ కార్యాలయం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. నగరం నుంచి రిమ్స్‌కు వెళ్లే దారి విశాలంగా ఉండటంతో ఆకతాయిలు విచ్చలవిడిగా మితిమీరిన వేగంతో వెళుతున్నారని తెలిపారు. దీంతో రహదారిపై ప్రయాణిస్తున్న అమాయకులు బలి అవుతున్నారని తెలిపారు. ఈ ప్రాంతంలో రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సీపీ నాయకులు తస్లీమ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : కెనరాబ్యాంకు స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాలకు చెందిన మహిళలకు టైలరింగ్, బ్యూటీ పార్లర్‌లో 30 రోజులపాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నామని డైరెక్టర్ నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.18–45 ఏళ్లలోపు కలిగిన మహిళలు అర్హులని పేర్కొన్నారు. జూన్ 1నుంచి శిక్షణ ప్రారంభిస్తున్నామని ఆసక్తి కలిగిన మహిళలు తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. పూర్తి వివరాలకు 9440905478, 6302833546 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

కేసీ కెనాల్ స్థలాలు కాపాడాలి

కడప సెవెన్‌రోడ్స్ : కడప నగర పరిధిలోని పాలెంపల్లె సర్వే నెంబరు 707, 708లోని కేసీ కెనాల్ పోరంబోకు స్థలాన్ని రియల్ ఎస్టేట్ వ్యాపారుల నుంచి కాపాడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జి.చంద్ర, నగర కార్యదర్శి ఎస్.వెంకట శివ సోమవారం జేసీకి విన్నవించారు. కొంతమంది పేద రైతులు కేసీ కెనాల్ పరిధిలో చాలా ఏళ్లుగా భూములు సాగు చేసుకుంటున్నారని తెలిపారు. కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు పేద రైతుల భూముల నుంచి రహదారుల నిర్మాణం చేపట్టారని, ఇందుకు అధికారులు సహకరిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్న కబ్జాదారులపై తక్షణమే చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు. ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎంవీ సుబ్బారెడ్డి, కొమ్మద్ది ఈశ్వరయ్య, నాయకులు మనోహర్‌రెడ్డి, బాలచంద్రయ్య, రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

వీరపునాయునిపల్లె : స్పందన కార్యక్రమంలో వచ్చిన ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని పులివెందుల ఆర్డీఓ వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం ఉరుటూరు 1 సచివాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గతంలో స్పందన కార్యక్రమం మండల స్థాయిలో సోమవారం ఒక్క రోజు మాత్రమే జరిగేదని, ప్రజలు ఇబ్బందులకు గురి కాకూడదన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఒక్క సచివాలయం, గురువారం మరో సచివాలయంలో నిర్వహించాలని నిర్ణయించిందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ వీరశేఖర్, మండల అభివృద్ధి అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

లింగాల : మండల కేంద్రమైన లింగాల సచివాలయంలో సోమవారం తహసీల్దార్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించి త్వరితగతిన వాటిని పరిష్కరించేందుకు ఆయా శాఖల అధికారులు కృషి చేయాలన్నారు. ఏఓ రమేష, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సరస్వతి, మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జనరంజక పాలనకు నాలుగేళ్లు

కడపలో భారీ బైక్ ర్యాలీ



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకుల బైక్ ర్యాలీ

కడప కార్పొరేషన్: రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా కడపలో వైఎస్సార్‌సీపీ నాయకులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు మాసీమ బాబు, అఫ్జల్‌ఖాన్, ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మెన్ పులి సునీల్ కుమార్, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డిలు ఈ కార్యక్రమానికి హాజరై జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. స్మిత్‌రోడ్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి మొదలైన ఈ ర్యాలీ కోటిరెడ్డి సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్, ఏడురోడ్ల కూడలి, క్రిష్ణా సర్కిల్, అప్సర థియేటర్, వై జంక్షన్, అంబేడ్కర్ కూడలి మీదుగా తిరిగి పార్టీ ఆఫీసుకు చేరింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో మరే పార్టీ సాధించని విధంగా 151 అసెంబ్లీ స్థానాలతో తిరుగులేని విజయం సాధించారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి అయిన వెంటనే అవ్వాతాతల పింఛన్‌ను రూ.2250కి పెంచిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఈ నాలుగేళ్లలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన సాగించారన్నారు. కరోనా విపత్కర పరిస్థితుల్లోనూ సంక్షేమ పథకాలను ఆపకుండా ప్రజలను ఆదుకున్నారన్నారు. లక్షలాది మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇస్తున్నారని, అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను రూపొందించి డీబీటీ ద్వారా నేరుగా వారి ఖాతాల్లో నగదు జమ చేస్తున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ప్రభుత్వంలో అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి పదవుల్లో, పనుల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించారన్నారు. పేదలకు మేలు చేస్తుంటే ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయని, రాబోయే ఎన్నికల్లో పేదలకు, పెత్తందారులకు మధ్య యుద్ధం జరగబోతోందని తెలిపారు. పేదలకు అండగా నిలుస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బంగారు నాగయ్య, జమాల్‌వలీ, సుబ్బారెడ్డి, ఐస్‌క్రీం రవి, షఫీ, సీహెచ్ వినోద్, పవర్ అల్తాఫ్, సుభాన్‌బాష, షంషీర్, ఆరీఫుల్లాబాషా, తోటక్రిష్ణ, దాసరి శివప్రసాద్, పస్తం అంజి, ఆర్‌వీ రమణ, చల్లా రాజశేఖర్, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలి



'స్పందన' కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్ : ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ అన్నారు. సోమవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన 'స్పందన' కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 47 అర్జీలు రాగా అందులో ఇంజినీరింగ్ విభాగం-11, టౌన్‌ప్లానింగ్-14, రెవెన్యూ విభాగం-8, పబ్లిక్ హెల్త్-4, యూపీఏ విభాగం-3, హౌసింగ్ -2, కడప తహసీల్దార్-2, ఏపీఎస్ఆర్‌టీసీ-1, ఏపీఎస్‌పీడీసీఎల్-1, డీఈఓ-1 అర్జీలు వచ్చాయి. వీటిని సమగ్రంగా పరిశీలించి, నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. అంతకుముందు మార్నింగ్ విజిట్‌లో భాగంగా కమిషనర్ 44వ డివిజన్‌లోని బాలాజీనగర్ ప్రాంతంలో పర్యటించారు. బాలాజీ నగర్ శ్మశానవాటికలో వర్షపునీరు లోనికి ప్రవేశించకుండా షీట్లను ఏర్పాటు చేయాలని, డీకేటీ పట్టాల ఆధారంగా హౌస్‌ట్యాక్స్ వేయాలని ఆదేశించారు. డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి, డీసీపీ సంజీవ్ కుమర్, ఎంహెచ్ఓ డా. ప్రశాంత్‌వర్ధన్, ఎస్ఈ రత్నాల రాజు, 44వ డివిజన్ ఇన్‌చార్జి రామక్రిష్టారెడ్డి, డీఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జూన్ 2న కడప ఐటీఐ కళాశాలలో జరగనున్న జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కడప మున్సిపల్ కమిషనర్ ఎస్ఎస్ సూర్యసాయిప్రవీణ్‌చంద్ తెలిపారు. సోమవారం ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జాబ్‌మేళా పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఈ జాబ్‌మేళాకు టెక్ మహీంద్ర, టాటా ఎలక్ట్రానిక్స్, మెడ్‌ప్లస్, అపోలో ఫార్మసీ, అమర్‌రాజా బ్యాటరీ, గ్రీన్‌టెక్ ఇండస్ట్రీస్, షిర్డిసాయి ఎలక్ట్రికల్స్, టీసీఎల్, సీఎస్‌టీ ప్రైవేటు లిమిటెడ్, వినూత్న ఫర్టిలైజర్స్, నవతా ట్రాన్స్‌పోర్టు వంటి 16 ప్రముఖ కంపెనీలు రానున్నాయన్నారు. జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఇతర వివరాలకు 6300125455, 9063623706, 9908808914 నెంబర్లలో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా మేనేజర్ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

బలవంతపు బదిలీలు సరికాదు



ఉపాధ్యాయులతో వైఎస్సార్‌టీఎఫ్ నేతలు రమణారెడ్డి, రమేష్, ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీవీ ప్రసాద్

కడప ఎడ్యుకేషన్ : తాజాగా జరుగుతున్న బదిలీల్లో 2015 బదిలీ ఉపాధ్యాయులకు మినహాయింపు ఇచ్చి న్యాయం చేయాలని వైఎస్సార్‌టీఎఫ్ నాయకులు రమణారెడ్డి, రమేష్, ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీవీ ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కడపలోని ఆర్ట్స్ కళాశాలలో 2015 బదిలీల ఉపాధ్యాయుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూర్తిగా 8 ఏళ్ల కాకముందే బలవంతంగా బదిలీ చేయడం అన్యాయం అన్నారు. రాష్ట్ర విద్యాశాఖ వెంటనే చర్యలు చేపట్టి 31 అక్టోబర్ 2023 కంటే ముందు బదిలీ అయిన వారికి మాత్రమే లాంగ్ స్టాండింగ్ నిబంధనలను వర్తింప చేయాలని కోరారు. లేకపోతే వీరికి అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. అకడమిక్ ఇయర్స్ నిబంధనలను రద్దు చేసి సీనియార్టీకి న్యాయం జరిగే విధంగా చూడాలని కోరారు. ఎస్టీఆర్ఎఫ్ నాయకులు నాగేశ్వర్ రావు మాట్లాడుతూ 2015 బదిలీ బాధితులంతా ఐకమత్యంతో ముందుకు సాగాలన్నారు. అనంతరం కలెక్టర్, ఆర్‌జేడీలకు వినతిపత్రాలు అందజేశారు. బాధిత ఉపాధ్యాయులు నరసింహారాజు, శ్రీనివాసులరెడ్డి, కుళాయిరెడ్డి, సుధారాణి, రమణ, మహేశ్వరెడ్డి, రామక్రిష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహానాడు సాక్షిగా బాబు మాయమాటలు



మాట్లాడుతున్న అఫ్జల్‌ఖాన్

కడప కార్పొరేషన్ : తెలుగుదేశం పార్టీ నిర్వహించిన మహానాడు సాక్షిగా ప్రతిపక్ష నేత చంద్రబాబు ప్రజలను మభ్యపెట్టేలా మాట్లాడారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్ విమర్శించారు. సోమవారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు పరిచిన చరిత్ర చంద్రబాబు జీవితంలో లేదన్నారు. దివంగత ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన కిలో రెండు రూపాయల పథకాన్ని, మద్యపాన నిషేధాన్ని ఎత్తేశారని గుర్తుచేశారు. 2014 ఎన్నికలకు ముందు 600 హామీలిచ్చి ఏ ఒక్క హామీని అమలు చేయకుండా, చివరికి మేనిఫెస్టోను టీడీపీ వెబ్‌సైట్ నుంచి తొలగించారని ఎద్దేవా చేశారు. ఇప్పుడు మళ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో పేదలను ధనికులుగా మారుస్తానని, ఉచిత సిలిండర్లు ఇస్తానని అనేక వాగ్దానాలతో మేనిఫెస్టో ప్రకటించడం సిగ్గుచేటన్నారు. చంద్రబాబు ఎన్ని హామీలిచ్చినా వాటిని నమ్మేందుకు ప్రజలు సిద్ధంగా లేరన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని అత్యధిక మెజార్టీతో గెలిపిస్తారని, మళ్లీ తిరుగులేని మెజార్టీతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు.

కట్టడాలను నిలిపివేయాలి

వీరపునాయునిపల్లె: చాగలమర్రి నుండి రాయచోటి వరకు ఏర్పాటు చేయనున్న రోడ్డు విస్తరణలో భాగంగా భూములు కోల్పోతున్న రైతులు కట్టడాలను నిలిపివేయాలని డిప్యూటీ తహసీల్దార్ వీరశేఖర్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చాలా మంది రైతులు ఎక్కువ నష్ట పరిహారం వస్తుందన్న ఉద్దేశంతో రహదారికి ఇరువైపులా నిర్మాణాలు చేపట్టడం జరుగుతోందన్నారు. భూ సేకరణ ప్రక్రియ ఇదివరకే ప్రారంభమయిందని తెలియజేశారు. ప్రస్తుతం చేపడుతున్న నిర్మాణాలకు ఎటువంటి నష్ట పరిహారం రాదన్నారు.

1న వేలంపాట

చక్రాయపేట: మండల కేంద్రం చక్రాయపేటలో ప్రతి ఆదివారం జరిగే వారపు సంతతో పాటు చెరువుల్లోని చేపలు పట్టుకుని విక్రయించు కొను నిమిత్తం జూన్ 1న వేలం పాట నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి(ఈవోపీఆర్డీ) గంగులయ్య తెలిపారు. చక్రాయపేట పంచాయతీలోని దేశిరెడ్డి చెరువు, రేకులకుంట చెరువు, ఉప్పర్ల కుంట చెరువుల్లో చేపలు పట్టుకుని విక్రయించు కొనే హక్కు కల్పించు నిమిత్తం వేలం వేస్తున్నట్లు చెప్పారు.

వాహనాల వేలం పాట

పులివెందుల రూరల్: వాహనాల బహిరంగ వేలం పాట ద్వారా ప్రభుత్వానికి రూ.1.03 లక్షల ఆదాయం వచ్చిందని ఎస్ఈబీ సీఐ రామాంజనేయులు పేర్కొన్నారు. సోమవారం స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్‌లో వివిధ కేసులలో సీజ్ కాబడిన వాహనాలకు ఎస్ఈబీ జిల్లా సూపరింటెండెంట్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బహిరంగ వేలం పాట నిర్వహించారు. ఈ వేలంపాటలో ఆరు వాహనాలను రూ.1,03,400లకు దక్కించుకోగా.. రూ.18,616ల జీఎస్టీ కలుపుకుని ఖజానాకు జమ చేశామన్నారు.

హక్కులను కాలరాస్తున్న బీజేపీ ప్రభుత్వం



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రాల హక్కులను కాలరాస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో నగర కమిటీ రెండు రోజుల శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. దేశంలోని మోదీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందన్నారు. కేసీఆర్ లాగా బీజేపీ నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విడిపోయి రావాలన్నారు. మోదీ ప్రభుత్వం అంటే చంద్రబాబు వణికి పోతున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం కొప్పర్తి ఇండస్ట్రీయల్ ఏరియాను మహానగరంగా తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్, నగర కమిటీ సభ్యులు చంద్రారెడ్డి, ఓబులేసు, జమీల పాల్గొన్నారు.

జూన్ 20న చలో విజయవాడ



మాట్లాడుతున్న ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ నేత పడాల రవణ

కడప వైఎస్ఆర్ సర్కిల్ : భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై జూన్ 20న నిర్వహించనున్న చలో విజయవాడను జయప్రదం చేయాలని ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల రవణ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని అమర స్వామి ఫంక్షన్ హాల్‌లో భవన నిర్మాణ కార్మికుల యూనియన్ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న అన్ని క్లెయిమ్‌లకు వెంటనే నిధులు మంజూరు చేయాలన్నారు. 2007లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి భవన నిర్మాణ కార్మికులను ఆదుకునేందుకు ఏపీ భవన నిర్మాణసంక్షేమ బోర్డును ఏర్పాటు చేశారన్నారు. ఈ సంక్షేమ బోర్డులో దాదాపు 22 లక్షల మంది నమోదు చేసుకొని సంక్షేమ పథకాలను అనుభవించేవారన్నారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం యజమాని సెస్ రూపంలో వసూలు చేయబడిన నిధులను భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ భవన నిర్మాణ కార్మిక యూనియన్ నాయకులు మద్దిలేటి, సోనారాజు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథం అవసరం



చిన్నారులచే ప్రయోగాలు చేయిస్తున్న శిక్షకులు

కడప కల్చరల్ : విద్యార్థులకు శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించడం అలవాటు చేయాలని సైన్స్ విభాగం శిక్షకులు ఆర్.శ్రీనివాసులురెడ్డి అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న విద్యార్థుల వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా 20వ రోజున సైన్స్ ప్రయోగాలు, విద్యార్థులకు అవగాహన అనే అంశంపై కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు ప్రయోగాల ద్వారా విజ్ఞాన శాస్త్రాన్ని శాస్త్రీయ పద్ధతిలో నేర్చుకోవాలని, ఆలోచనతో ప్రకృతి పట్ల ప్రేమను పెంచుకోవాలన్నారు. సైన్స్ క్లబ్ కార్యదర్శి వై.శ్రీధర్‌రావు మాట్లాడుతూ శాస్త్ర విజ్ఞాన అధ్యయనం నాలుగు గోడలకు పరిమితమైంది కాదని, క్షేత్ర స్థాయిలోనూ, ప్రయోగశాలతోనూ స్పష్టమైన సంబంధం కలిగి ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సులభ స్థాయిలో గణితం నేర్చుకునే పద్ధతులను కూడా వివరించారు. గణిత శిక్షకులు సుబ్రమణ్యం విద్యార్థులకు గణిత చిట్కాలు నేర్పారు. స్పోకెన్ ఇంగ్లీషు, క్రాఫ్ట్ కథా పఠనం, నృత్యం కూడా నేర్పారు. గ్రంథాలయ సంస్థ కార్యదర్శి అమీరుద్దీన్, డిప్యూటీ లైబ్రేరియన్ పవన్‌కుమార్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

వేసవి అలవెన్సులు కొనసాగించాలి

కడప సెవెన్‌రోడ్స్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో పనిచేస్తున్న కూలీలకు వేసవి అలవెన్సులు కొనసాగించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కూలీలు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శివకుమార్, అన్వేష్, సీపీఎం రాష్ట్ర నాయకులు నారాయణ, జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత ధరలకు అనుగుణంగా కూలీ రేట్లు పెంచాల్సిందిపోయి అలవెన్సులు తొలగించడం విచారకరమన్నారు. వంద రోజులు పూర్తి చేసుకున్న కుటుంబాలకు అదనంగా పని కల్పించాలని కోరారు. చేసిన పనులకు ప్రతి శనివారం డబ్బులు చెల్లించాలని, ప్రతి కుటుంబానికి పనిముట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. హేతువాద సంఘం నాయకులు సీఆర్‌వీ ప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు గోవింద్, రమణమ్మ, ఖాదర్‌బాష తదితరులు పాల్గొన్నారు.

● అపూర్వ కలయిక..

కడప ఎడ్యుకేషన్ : కడప గాంధీనగర్ మున్సిపల్ హైస్కూల్‌లో 30 ఏళ్ల క్రితం పదో తరగతి చదివిన విద్యార్థులు సోమవారం అపూర్వ కలయికతో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తాము చదువుకున్నప్పటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఆనందంగా గడుపుతూ మురిసిపోయారు. ఈ సమావేశానికి వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారు సైతం రావడం విశేషం. నాటి గురువులు, హెడ్‌మాస్టర్ రామ్మూర్తిని ఘనంగా సత్కరించి గురుభక్తిని చాటుకున్నారు.



గాంధీనగర్ మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన 30 ఏళ్లనాటి పూర్వపు విద్యార్థులు

జగనన్న ప్రభుత్వాన్ని మళ్లీ తెచ్చుకుందాం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం జిల్లా నేతలు

కడప కార్పొరేషన్ : రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించి మళ్లీ జగనన్న ప్రభుత్వాన్ని తెచ్చేందుకు వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం కృషి చేస్తుందని ఆ విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శివా నాయక్ అన్నారు. సోమవారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నాడు–నేడు కింద అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల రూపురేఖలు మారిపోతున్నాయన్నారు. పేద ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందించేందుకు జగనన్న ప్రభుత్వం సమూల మార్పులు తీసుకొచ్చిందన్నారు. ఆరోగ్యశ్రీ, 108, 104 పథకాలకు ప్రస్తుత ప్రభుత్వం జవసత్వాలు తీసుకొచ్చిందని వివరించారు. రాబోయే ఎన్నికల్లో వైద్య విభాగం సభ్యులు అత్యంత చురుగ్గా పనిచేసి, ప్రభుత్వం చేసిన మంచి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని తెలిపారు. వైద్యులు డా. సొహైల్, అధికార ప్రతినిధి డా. కిరణ్‌కుమార్, జోనల్ ఇన్‌చార్జి అమీర్‌బాషా, డా. సతీష్‌రెడ్డి, మహిళా నాయకురాలు సింధు, జగన్‌రాథోడ్ పాల్గొన్నారు.

బీజేపీ ఎంపీపై చర్యలు తీసుకోవాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై చర్యలు తీసుకోవాలని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుమల్లేష్ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. భారత కీర్తిని పెంచే రెజ్లర్లపై లైంగింక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దేశ రాజధాని ఢిల్లీ 30 రోజులుగా నుంచి నిరసన తెలుపుతుంటే చర్యలు తీసుకోకుండా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సరికాదన్నారు. యూత్ కాంగ్రెస్ నాయకులు వంశీ యాదవ్, సాయి పాల్గొన్నారు.

రెజ్లర్లను అక్రమ అరెస్ట్ చేయడం దారుణం

రెజ్లిస్ క్రీడాకారులపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ పేర్కొన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అక్రమ అరెస్టులను ప్రజాస్వామ్యవాదులు ముక్త కంఠంతో ఖండించాలన్నారు.

మహిళా రెజ్లర్లపై దాడి అమానుషం

కడప ఎడ్యుకేషన్ : న్యూఢిల్లీలోని కొత్త పార్లమెంట్ భవనం సమీపంలో న్యాయపోరాటం చేస్తున్న మహిళా రెజ్లర్లపై పోలీసుల దాడి అమానుషం అని వారిపై అక్రమ కేసును బనాయించి అరెస్టు చేయడం తీవ్ర అన్యాయం ప్రగతిశీల మహిళా సంఘ నాయకురాల్లు మీనాక్షి, అమరావతి, స్వాతి అన్నారు. కడపలోని నబీకోట ప్రాంతంలోని తమ కార్యాలయంలో వారు మాట్లాడారు. మహిలా రెజ్లర్లపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని బ్రిజ్ భూషన్ చరణ్‌సింగ్‌ని అరెస్టు చేయడంతో పాటు పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన ఐటీ సలహాదారు

బద్వేలు అర్బన్: బద్వేలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సోమవారం రాష్ట్ర ప్రభుత్వ ఐటీ సలహాదారు పాటూరు శేషిరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా గత కొద్ది రోజులుగా రిజిస్ట్రేషన్ల విషయంలో జరుగుతున్న సాంకేతిక కారణాలను అడిగి తెలుసుకుని సరిచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆయా ప్రభుత్వ కార్యాలయాల్లో ఎలాంటి సాంకేతిక లోపాలు లేకుండా నిరంతరాయ సేవలు అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. పాస్‌పోర్టు కేంద్రాల తరహాలో త్వరలోనే రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం యోచిస్తోందని తెలిపారు.

● ఇదేనా స్వచ్ఛత!



నగరంలోని డీఎస్ఏ క్రీడామైదానంలో రూ. 1 కోటిపైగా వెచ్చించి నిర్మించిన స్విమ్మింగ్‌పూల్ పరిసరాలు మురికికూపంలా మారాయి. స్విమ్మింగ్‌పూల్ నుంచి వచ్చే నీరు బయటకు వెళ్లేమార్గం లేక రోజుల తరబడి నిలిచిపోవడంతో ఆ పరిసరాలు మురుగు కాల్వను తలపిస్తున్నాయి. స్విమ్మింగ్‌పూల్‌ను ప్రైవేట్ వ్యక్తులకు లీజుకు ఇచ్చిన తర్వాత డీఎస్ఏ అధికారులు అటువైపు చూడటం మానేశారు. ఫలితంగా డీఎస్ఏ ఆవరణం ఇలా అధ్వానంగా తయారైంది. అధికారులు స్పందించి సరి చేయాలని క్రీడాకారులు, వాకర్స్ కోరుతున్నారు. – కడప స్పోర్ట్స్

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



వలంటీర్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి

చింతకొమ్మదిన్నె : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హయాంలోనే ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయని కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం కడప నగర పరిధిలోని 17వ డివిజన్ పరిధిలోని వెంకటగారిపల్లె, పోలుగారిపల్లె గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. కులం, మతం, పార్టీ చూడకుండా అర్హతే ప్రామాణికంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గూడ ప్రభాకర్ రెడ్డి, మాజీ కన్వీనర్ గుత్తిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, 17వ డివిజన్ కార్పొరేటర్ గుత్తిరెడ్డి చంద్రహాసరెడ్డి, ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ కృష్ణయ్య, మండల ఉపాధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, ఎంపీటీసీలు వెంకటరెడ్డి, నాగరాజు, సర్పంచులు సురేంద్రారెడ్డి, మల్లిఖార్జున యాదవ్ లక్ష్మిరెడ్డి పాల్గొన్నారు.

పథకాల అమలులో వలంటీర్లది కీలకపాత్ర..

పెండ్లిమర్రి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు చేరవేయడంలో వలంటీర్లే కీలకమని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో సభా భవనంలో సోమవా రం వలంటీర్లకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శమన్నారు. ఏరాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలో ప్రతి రెండు వేల జనాభాకు ఒక గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకవచ్చి సచివాలయంలో ప్రజలకు అన్ని శాఖల అధికారులు అందుబాటులో వలంటీర్లను ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలు వారి ద్వారా ప్రజలకు అందజేయడం ప్రశంసనీయమని కొనియాడారు.

రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీలకు డీఏవీ విద్యార్థులు

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్లలోని జువారి కర్మాగారంలో ఉన్న డీఏవీ స్కూల్‌లో చదువుతున్న విద్యార్థులు రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీలకు ఎంపికయ్యారని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రఘురాం సోమవారం తెలిపారు. ఈ నెల 28న ప్రొద్దుటూరులో జరిగిన జిల్లా స్థాయి స్కేటింగ్ పోటీలలో పాల్గొని అండర్ 8,10,12,14 విభాగాలలో విద్యార్థులు ప్రతిభ కనపరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. గుంటూరులో నిర్వహించబోవు రాష్ట్ర పోటీలలో విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు.